
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 24 మే 2024

రాష్ట్రంలోనే జిల్లాను ఆదర్శంగా నిలపాలి - 7లో..

దోస్తీ మీట్-2024 క్రీడలు ప్రారంభం - 8లో..



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు

- నేటి నుంచి జూన్ 1 వరకు పరీక్షలు
- ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహణ
- జిల్లాలో 3,685 మంది విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని హాజరుకానున్నారు. శుక్రవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు కొనసాగనున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాల ద్వారా 3685 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇంటర్ జనరల్‌లో మొదటి సంవత్సరం పరీక్షలకు 2222 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం పరీక్షలకు 1463 మంది హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు సీసీ కెమెరాలతో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్ష సమయంలో జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలనుమూసివేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

● పరీక్షల నిర్వహణకు 280 మంది సిబ్బంది

జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఇద్దరు డీఈసీలు, ఒక్కో పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌లు 14 మంది, అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులు 14 మంది, మరో నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్, రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ నుంచి ముగ్గురు సభ్యులతో ఫ్లయింగ్ స్క్వాడ్, ముగ్గురు కస్టోడీయన్‌లను నియమించారు. పోలీస్ స్టేషన్‌లలో పరీక్ష పత్రాలను ఉంచారు. పరీక్ష పత్రాలు సీసీ కెమెరాల ముందే తెరవనున్నారు. ప్రతీ 25 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. దాదాపు 230 మంది వరకు ఇన్విజి లేటర్లుగా విధులు నిర్వర్తించనున్నారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. పరీక్ష గదుల్లోకి సెల్ ఫోన్‌లు ఇతర ఎలక్ట్రికల్ వస్తువులకు అనుమతి లేదు. విద్యార్థులు ముందుగానే హాల్ టికెట్లలో పొరపాట్లు ఉంటే చూసుకోవాలి. ఫొటోలు, సబ్జెక్ట్‌లు, సంతకం వంటివి సరిగా ఉన్నాయా? లేదా? సరిచూసుకోవాలి.

● జిల్లాలోని పరీక్ష కేంద్రాలు ఇవే

జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు), సెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), సాయిశ్రీ జూనియర్ కళాశాలల్లో సెంటర్‌లను ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, వేములవాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, సుమిత్ర ఒకేషనల్ జూనియర్ కళాశాల, కోనరావుపేట, ఇల్లంతకుంట, చందుర్తి, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలు, ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాచర్ల జూనియర్ కళాశాలలో సెంటర్‌లను ఏర్పాటు చేశారు.

● జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో 65.5 శాతం ఉత్తీర్ణత

ఈ ఏడాది జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 65.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో మొదటి సంవత్సరం 57.79 శాతం ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటి సంవత్సరంలో 13వ స్థానం, రెండవ సంవత్సరంలో 16వ స్థానంలో నిలిచింది. మొత్తం 6722 మంది విద్యార్థులకు 4138 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 1195 మంది, బాలికలు 2935 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత సాధించనివారు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ద్వారా ఉన్నత చదువులకు వెళ్లడానికి మరో అవకాశం కల్పించారు.

పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి

- మోహన్, ఇంటర్మీడియెట్ విద్యాధికారి



జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నాం. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి. పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశాం.

గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గల్ఫ్ కార్మికులు

వేములవాడ టౌన్, మే 23 : ఎన్నారై పాలసీతో కూడిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం సభ్యులు కోరారు. దుబాయి పర్యటనలో ఉన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. తెలంగాణ వలస కార్మికుల కోసం ప్రభుత్వ పరమైన భద్రత, భరోసా కల్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణ



కరపత్రాలు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్

వేములవాడ టౌన్, మే 23:ప్రైవేటు డిగ్రీ కళాశాలకు దీటుగా వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవేల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం డిగ్రీ కళాశాల వసతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో అన్ని వసతులతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తున్నట్లు చెప్పారు. కంప్యూటర్ లాబ్, డిజిటల్ గ్రంథాలయం, విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానంతోపాటు వేములవాడ, సిరిసిల్ల పట్టణాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి సైన్స్ విభాగంలో కొత్తగా ఫుడ్ సైన్స్, డాటా సైన్స్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మోగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు నీలం శ్రీనివాసులు, నారాయణ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వేములవాడ రూరల్, మే 23: మండలంలోని మర్రిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 12 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, లచ్చిరెడ్డి, ఉమా మహేశ్వర్, అంజయ్య, స్వరూపరాణి, రమ, పూర్వ విద్యార్థులు రజినీకాంత్, గంగస్వామి, వెంకటేశ్, మహేష్, నరేష్, శ్యామల, సౌందర్య, హేమలత, దివ్య వనిత, స్వాతి, మధుశ్రీ, శ్రీలేఖ, దీపిక, మమత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలి

- తరలింపునకు లారీల సంఖ్య పెంచాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

చందుర్తి, మే 23 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. చందుర్తి మండలంలోని మర్రిగడ్డ, మల్యాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి పరిశీలించారు. మర్రిగడ్డ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల, ధాన్యం కాంటాలు, తేమ యంత్రాలు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని సూచించారు. లారీల సంఖ్యను పెంచాలని, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ త్వరితగతిన చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

రుద్రంగి : కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం తరలింపునకు లారీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రంలోని సింగిల్ విండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో వ్యవసాయం చేస్తారు? ఎంత దిగుబడి వచ్చింది? వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పాం సాగుపై కలెక్టర్ ప్రశ్నించగా ఇద్దరు రైతులు సాగుచేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులపై తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, లారీల సంఖ్యను పెంచడంతోపాటు రైస్ మిల్లు వద్ద త్వరగా ఆన్‌లోడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్, మేనేజర్ జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్ శ్రీలత, ఆర్‌ఐ నవీన్, రుద్రంగి సింగిల్ విండో డైరెక్టర్ కెసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య తర్రె లింగం, తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో ప్రయాణికుల అవస్థలు

- బస్ షెల్టర్ వాటర్‌ప్లాంట్‌కు కేటాయింపు - రోడ్డు వెడల్పులో పూర్తిగా తొలగింపు



బస్ షెల్టర్ లేక ఎండలో నిల్చున్న ప్రయాణికులు

రుద్రంగి మే 23: బస్ షెల్టర్ లేక మండుటెండల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరా చౌక్ ప్రధాన చౌరస్తాలో గతంలో బస్ షెల్టర్ ఉండేది. గత పాలకులు బస్ షెల్టర్‌ను ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌కు కేటాయించారు. అప్పటి నుంచి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రోడ్డు వెడల్పులో భాగంగా ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌కు కేటాయించిన బస్ షెల్టర్‌ను కూల్చివేశారు. ఉద్యోగస్థులు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పెద్ద సంఖ్యలో బస్సుల్లో వచ్చి వెళ్తుంటారు. ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో దగ్గరలో ఉన్న దుకాణాల ఎదుట కింద కూర్చోవాల్సి వస్తోందని, ఎండలో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఆధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి

- పిల్లమారపు ప్రవీణ్, రుద్రంగి.



నిత్యం వివిధ పనుల నిమిత్తం ఆయా గ్రామాల నుంచి రుద్రంగి మండల కేంద్రానికి ప్రజలు వస్తుంటారు. ఇందిరా చౌక్ చౌరస్తాలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు, మహిళలు, వృద్ధులు ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు ఇందిరాచౌక్‌లో బస్‌షెల్టర్ నిర్మించాలి. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

క్రీడలతో స్నేహభావం పెంపు

- ఎస్పీ అఖిల్ మహాజన్



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహజన్

తంగళ్లపల్లి, మే 23: క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దోస్త్ మీట్-2024 కార్యక్రమంలో భాగంగా తంగళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యవత క్రీడల్లో రాణించాలని, సన్మార్గంలో నడవాలని అన్నారు. యువతను ప్రోత్సహించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలో ప్రతిభ కనబరిచిన జట్టును జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ సదన్‌కుమార్, ఎస్సై సుధాకర్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : యువత క్రీడల్లో రాణించాలని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గంభీరావుపేట కేజీ టు పీజీ కళాశాల మైదానంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యం, మత్తు పదార్థాల బారిన పడకుండా, క్రీడలపై అసక్తి చూపాలన్నారు. ఎస్సైలు బాపు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. జిల్లా పోలీస్ దోస్త్ మీట్‌లో బాగంగా నూకలమర్రిలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారితో కలిసి గురువారం ప్రారంభించారు. యువత క్రీడలలో రాణించాలన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శిక్షణతో మెరుగైన ఫలితాలు

ఇల్లంతకుంట, మే 23: శిక్షణ శిబిరాలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్, శిక్షణ శిబిరం నిర్వాహకులు శివరాం, కీసరి బాబు, మామిడి శ్రీను పాల్గొన్నారు.

పెద్దలింగాపూర్‌లో బుద్ధ పౌర్ణమి

ఇల్లంతకుంట, మే 23: మండలంలోని పెద్దలింగాపూర్‌లో బుద్ధపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలోని బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవకోటికి ప్రేమతత్వాన్ని బోధించిన మహనీయుడి ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. నాయకులు పసుల బాలరాజు, గన్నారం నర్సయ్య, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

రుద్రవరంలో ..

వేములవాడ టౌన్: బుద్ధుడి జన్మదినం సందర్భంగా రుద్రవరంలో బౌద్ధ పౌర్ణమి వేడుకలను అంబేద్కర్ సంఘం, మాల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వేములవాడ మండలం రుద్రవరంలో ఏర్పాటు చేసిన బౌద్ధ విహార్‌లో వేడుకలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, అశోక్, వంకాయల భూమయ్య, లక్ష్మీరాజం, కూతురు రమేష్, మహేశ్వర్, ఎర్రకొక్కుల రమేష్, లక్ష్మీపతి, బాబు, నాగరాజు, నవీన్, నరేష్, వీరేందర్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణం.. రథోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తంగళ్లపల్లి, మే 23: తంగళ్లపల్లి మండలం రామన్న పల్లెలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరు కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వ హించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కల్యా ణాన్ని తిలకించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం రథోత్సవం కన్నుల పండువగా సాగింది.

తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో వేణుగోపాలస్వామి ఆలయంలో మూడు రోజులుగా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభంగా సాగుతున్నాయి.గురువారం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం కనగర్తిలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా వేణుగోపాల స్వామి రథోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త లు స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ బాపురెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ భూంరెడ్డి, బెండె శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



కొత్తపల్లిలో గరుడసేవ

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం కొత్తపల్లి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 17న స్వామివారి బ్రహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం వరకు కొనసాగనున్నాయి. బ్రహోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్వామివారి గరుడ సేవ చేపట్టారు. స్వామివారు దర్శనమివ్వగా భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి మంగళహారతులు ఇచ్చి దర్శించుకున్నారు. శుక్రవారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా సాగనుంది.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


సైదాపూర్ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

సైదాపూర్, మే 23: సైదాపూర్ మండల కేంద్రం నుం చి ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గురువా రం తెల్లవారు జామున పె ట్రోలింగ్ చేస్తున్న పోలీసుల ను చూసి వెంకటేశ్వ ర్లపల్లి గ్రామ శివారులో టీఎస్08 యూబీ 3009 నంబర్ గల ట్రాలీ వాహనాన్ని రోడ్డుపై వదిలి కొందరు వ్యక్తులు పరారయ్యారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయడంతో అందులో 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం కనిపించాయి. వాహనం నంబర్ ఆధారంగా విచారించగా చిగురుమామిడి మండలం బొమ్మన పల్లికి చెందిన వల్లెపు అనిల్, బత్తుల కుమార్ అనే వ్యక్తి వద్ద నుంచి బియ్యాన్ని బీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.

రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి
నలిమెల భాస్కర్ ఎంపిక

ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రదానం



కరీంనగర్ కల్చరల్, మే 23: ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్రపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, ఎన్‌టీ ఆర్ స్టేడియంలో జరిగే ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి తెలుగు భాషా సాహిత్యంలో విశేష పరిశోధనకు జిల్లా కేంద్రానికి చెందిన బహుభాషా వేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ ఎంపికయ్యారు. ఈ మేరకు సమన్వయ కర్త ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, కార్యదర్శి డాక్టర్ అప్పం పాండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద 50 వేల రూపాయల నగదు బహు మతి అందించనున్నారు. ముఖ్య అతిథిగా పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నర సింహారెడ్డి, అతిథులుగా విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ వెలిచాల కొండలరావు, పాత్రికేయుడు కె రామచంద్ర మూర్తి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి, పూర్వ సంస్కృత శాఖా ధ్యక్షుడు ఆచార్య ఎ రాములు, సాహితీ పరిశోధకుడు డాక్టర్ శ్రీరంగాచార్య, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాద కులు డాక్టర్ కె శ్రీనివాస్, ఆయుర్వేద వైద్య పరిశోధకుడు డాక్టర్ భాగవతం రామారావు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (యుఎస్ఏ) రవ్వా రమేశ్ హాజరుకానుండగా ప్రొఫెసర్ కె యాదగిరి అధ్యక్షత వహించనున్నారన్నారు. సుమారు 14 భాషల్లో ప్రావీణ్యం సాధించిన వ్యక్తిగా, విశ్రాంత తెలుగు అధ్యాపకులుగా, నిత్య పరిశోధకు లుగా ఉంటున్న కవి, రచయిత డాక్టర్ భాస్కర్‌కు ఈ పురస్కారానికి ఎం పిక కావడం పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలియ జేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

సెలవులో రాజన్న ఆలయ ఈవో

ఇన్‌చార్జి ఈవోగా రామకృష్ణ



వేములవాడ టౌన్, మే 23 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అనారోగ్యం కారణంగా 15 రోజులు సెలవులో వెళ్లారు. దేవాదాయ శాఖలో రీజనల్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం రాజన్న ఆలయానికి వచ్చిన రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నా రు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో ప్రతాప నవీన్ ప్రసాదం అందజేశారు. సూపరిం టెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, నర్సయ్య, అశోక్ ఉన్నారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన ఎస్‌యూ అధికారులు


ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీకి అభినందనలు తెలుపుతున్న యూనివర్సిటీ అధికారులు

గణేశ్‌నగర్,మే 23: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకుల పతిగా బాధ్యతలు స్వీకరించిన కె సురేంద్ర మోహన్‌ను గురువారం స చివాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఫైనాన్స్ ఆఫీసర్ రవీందర్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. సురేంద్ర మోహన్ ప్రస్తుతం రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు ఇన్‌చార్జి వీసీతో పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా యూనిర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు ఇన్‌చార్జి వీసీ సురేంద్ర మోహన్ తెలిపారని వారు తెలిపారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్,మే 23: శాతవాహన యూనివర్సిటీ బీఈడీ ఒకటవ సెమిస్టర్, ఎంఈడీ ఒకటవ, మూడో సెమిస్టర్, ఎల్.ఎల్.బి ఒకటో సెమిస్టర్‌లకు సంబం ధించిన పరీక్షల తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. దీనికి సంబంధించిన వివరాలు యూని వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.


షార్ట్‌సర్క్యూటతో గృహోపకరణాలు దగ్ధం


రూ.5 లక్షల నష్టం

ఎల్లారెడ్డిపేట, మే 23:జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలకు తాకడంతో ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఆ ప్రాంతంలోని సుమారు 30 ఇళ్లలోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. భారీ శబ్దంతో ఒక్క సారిగా మంటలు ఎగిసి పడడంతో ఇళ్లలోని టీవీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఫ్యాన్లు కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తాకడంతో ఇళ్లలోని పరికరాలు కాలిపోయాయని పేర్కొన్నారు. చెట్ల కొమ్మలకు దగ్గరలో ఉన్న తీగలను సరి చేయాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తీగలను సరి చేయడంతోపాటు తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, మే 23: కరీంనగర్ కోర్టు సమీపంలోని లైఫ్‌లైన్ హాస్పిటల్‌లో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆసుపత్రి ఎలివేషన్ బోర్డులో మంటలు అంటుకున్నాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సమా చారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌తో సహా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు. స్వల్ప నష్టం వాటిల్లగా ఎవరికీ ప్రమాదం జరగలేదని తెలిపారు.






కోటలో ఉన్న ఫిరంగి

'ఎలగందల్'కు ఆదరణ ఏదీ?

భగత్‌నగర్, మే 23: ఎలగందల్ కోట పర్యాటక శోభితం.. నిరాదరణకు గురవుతున్న కళాకట్టడం.. కాకతీయుల కళా చిహ్నంగా నిర్మితమైన కోట.. పంచరాజవంశీయుల పాలనలో విలసిల్లింది. అలనాటి జిల్లా కేంద్రం... నిజాం పరిపాలనలో ఎలగందల్ కోటలోనే ప్రధాన కార్యాలయం... పర్యాటకంగా ఎంతో విశిష్టత ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కళాచిహ్నం నిరాదరణకు గురవుతున్నది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి ఆనుకుని మానేరు నది ఒడ్డున ఉన్న ఎలగందల్ గ్రామంలోని కోట చారిత్రాకంగా గుర్తింపు పొందింది. కాకతీయులు, కుతుబ్‌షాహీ వంశీయులు, మొఘల్ సామ్రాజ్యం, హైదరాబాద్ నిజాం, ఆసఫ్‌జాహీల పాలనలో విలసిల్లిన ఎలగందల్ కోటపై పట్టింపుకరువైంది. ఆంధ్రప్రదేశ్ సమైక్యరాష్ట్రంలో ఎలగందల్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు యాభై లక్షల రూపాయలు కేటాయించారు. సంవత్సరం పాటు పర్యాటక శాఖ వారు లైటింగ్ ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా లైటింగ్ సౌండ్ సిస్టం ఏర్పాటు చేయడంతో కొంత మేర పర్యాటకులు ఎలగందల్ కోటను వీక్షించేందుకు వందల సంఖ్యలో తరలి వచ్చేవారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పిడుగు పాటుకు ప్రొజెక్టర్లు చెడిపోయాయి.

పురాతన జ్ఞాపక చిహ్నాలు

ఎలగందల్ కోటలో పురాతన జ్ఞాపక చిహ్నాలు ఎన్నో ఉన్నాయి. కొండ శిఖరాన ఉన్న ఎత్తైన కోట, తూర్పు ద్వారానికి వెలుపల ఉన్న బృందావన సరస్సు 1774లో ఫాఫర్-ఉద్-దౌలా చేత నిర్మించబడినది. ముస్లిం సన్యాసులైన సయ్యద్ షాహ్, మునావర్ క్వాద్రి సాహెబ్, దులా షాహ్ సాహేబ్, సయ్యద్ మరూఫ్ సాహెబ్, షాహ్ తాలిబ్ బిస్మిల్లా సాహెడ్ వాలి షైదర్ సాహెబ్ సమాదులు కదిలిస్తే కొండ మీద ఉన్న మినార్‌లు ఊగుతాయని నానుడి. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మరో రెండు మినార్లు నిజాం రాజులు నిర్మించారు. ఈ మినార్లు ఎక్కడానికి లోపలి నుంచి మెట్లు ఉంటాయి. వీటితో పాటు ఎలగందల్‌కోట నుంచి మానకొండూర్ వరకు 9 కిలోమీటర్ల మేర రహస్య సొరంగ మార్గం ఉందని ఇప్పటికీ ప్రజలు నమ్ముతారు.

పర్యాటకులకు రక్షణ కరువు

ఎలగందల్ కోటను చూడడానికి నిత్యం పర్యాటకులు వస్తున్నా అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడంలో విఫమయ్యారనేది వాస్తవం. ఎలగందల్ కోటను చూడానికి లోపలికి వెళ్లిన వారు కోట పైన చిన్నా పెద్ద ఎవరికి ఇష్టం వచ్చినట్ల వారే తిరిగి రావాల్సిందే. కోట పైభాగంగా రక్షణ చర్యలు ఏం లేకపోవడం విమర్శలకు తావు ఇస్తున్నది. పర్యాటకుల రక్షణ కోసం కోటపై భాగంలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పంచరాజవంశీయుల పాలన


ఎలగందల్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని ఐదుగురు రాజవంశీయులను ఎలగందల్ కోట నుంచి పాలన కొనసాగించారు. 1083-1323 సంవత్సరం మధ్య కాలంలో కాకతీయుల రాజవంశీయులు ఎలగందుల కోటను నిర్మించారని చరిత్ర పాటాలు చెబుతున్నారు. యోధులైన ముసు నూరి నాయక్, రాచర్ల పద్మనాయక్‌లు ఎలగందల్ కోటను దృఢంగా చేశారు. 16వ శతాబ్ధంలో కుతుబ్‌షాబి వంశస్తులు కోటను ఆక్రమించుకుని క్యుయినముల్‌ఉల్‌ను కమాండర్‌గా నియమించారు. అనంతరం మొఘల్ సామ్రాజ్యం ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత హైదరాబాద్ నిజాం ఉల్‌ముల్క్ నిజాం ఉల్ ముల్క్ నిజాం అసఫ్జాహ్ 1724-1748 వరకు ముగ్రాబ్ హయాంలో అమీన్‌ఖాన్ ఎలగందల్‌కు ఖిలేదార్‌గా నియమించ బడ్డాడు. నవాబ్ సలాబత్ జంగ్ హయాంలో మిర్జా ఇబ్రహీం దంసా ఖిలేదార్ అయ్యాడు. సికందర్ ఝా 1803-1823 వరకు పాలించాడు. 1754 సంవత్సరంలో దంసా ఈ కోటను పునర్నిర్మాణం చేసినట్లు చరిత్ర చెబుతున్నాయి. బహదూర్‌ఖాన్, కరీముద్దీన్‌లు తరువాతి కాలంలో ఖిలేదారులుగా పనిచేశారు. ఎలగందల్ ఖిలేదారుగా పనిచేసిన కరీముద్దీన్ పేరు మీదనే కరీంనగర్ మారినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1905 సంవత్సరంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్ జిల్ల కేంద్రాన్ని ఎలగందల్ నుంచి కరీంనగర్ మార్చారు.


మినార్

నైసర్గిక స్వరూపం

కరీంనగర్ జిల్లా కేంద్రానికి 10కిలో మీటర్ల దూరంలో ఉండి మానేరు నదీ తీరాన ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో జిల్లాల పునర్ వ్యవస్తీరణలో భాగంగా ఈ గ్రామం కరీంనగర్ మండలం నుంచి కొత్తపల్లి మండలంలోకి మార్చారు. 2011 జనాబా లెక్కల ప్రకారం 997 ఇళ్లతో 3,937 జనాబా, 1,720 హెక్టార్లలో విస్తరించి ఉంది.

● కాకతీయుల కాలం నుంచి నిజాం రాజ వంశీయులు ఆసంజాహీ వంశీయుల వరకు ఎలగంగల్ కోట నిత్యం కళా వైభవాన్ని చాటినప్పటికీ నేడు కళా విహీనంగా తయారై నిరాదరణకు గురవుతున్నది. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలగంగల్ కోట అభివృద్ధిపై దృష్టి సారించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది.



ఎలగందల్ కోట ముఖద్వారం

తెల్లకందుల.. వెలగందుల.. ఎలగందుల

పూర్వం ఈ ఊరి పేరు బహుధాన్యా నగరం. కాకతీయుల కాలం నుంచి ఎలిగందులగా పిలువబడుతున్నది. ఎలగందుల గ్రామం చుట్టు ప్రాంతాల్లో ఎక్కువగా తెల్ల కందులు పండేవని ప్రసిద్ధి. దీంతో ఈ గ్రామానికి రాను రాను తెల్లకందుల పోయి ఎలగందల గ్రామం పేరు స్థిరపడిందనే చరిత్ర నానుడిలో ఉంది. తెల్లకందుల అన్న పేరు చింతామణి చెరువు వద్ద ఉన్న శాసనంలో స్పష్టంగా చెక్కబడి ఉంది. కొంత మంది మొదటి వెలగందుల గ్రామంగా ఉన్న పేరుకాస్త ఎలగందులగా స్థిరపడిందని చెప్పుకుంటుంటారు.

శత్రు దుర్భేద్యమైన కోట

ఎలగందల్‌కోటను పాలించిన రాజులు శత్రు దుర్భేద్యంగా నిర్మించు కున్నారు. శత్రువుల బారి నుంచి కోటను, దాడుల నుంచి కాపాడుకోవ డానికి ఎలగందల్ పాలకులు కోట చుట్టు ఐదుమీటర్ల (16అడుగుల) వెడల్పు 4 మీటర్లు (13 అడుగులు) లోతుతో పెద్ద పెద్దకందకాలు కోట చుట్టూ తవ్వి కందుకంలో రక్షణ కోసం మొసళ్లను వదిలి రక్షణ పొందే వారని చరిత్ర చెబుతున్నది.



కోటిలింగాల గోదావరి వద్ద పారిశుధ్య లోపం

● పుష్కర ఘాట్లపై పేరుకు పోయిన చెత్త ● గోదావరిలో స్నానాలకు ఇబ్బంది పడుతున్న భక్తులు ● పట్టించుకోని అధికారులు


ఘాట్లపై భక్తులు వదిలి పెట్టిన దుస్తులు, వ్యర్థ పదార్థాలు

వెల్గటూర్, మే 23: ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల వద్ద గోదావరి నదిలో పారిశుధ్యం లోపించింది. పుష్కర ఘాట్లపై ఎక్కడ చూసినా భక్తులు వదిలిన పాత బట్టలు, వ్యర్థ పదార్థాలు దర్శనమిస్తున్నాయి. దీనితో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గోదావరి కళకళలాడేది. అప్పుడు భక్తులు పుష్కర ఘాట్ల వద్ద స్నానాలు చేసేవారు. పాత బట్టలను గోదావరిలో వదిలి పెడితే తమకు ఉన్న దోషాలు పోతాయని నమ్మే భక్తులు తమ వద్ద ఉన్న పాత దుస్తులను గోదావరిలో వదిలి పెట్టారు. స్నానాలు చేయడానికి గోదావరిలో దిగిన భక్తులకు నీటిలో తేలిన పాత దుస్తులు తమకు తగిలే సరికి స్నానాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండలకు గోదావరి లో నీటి మట్టం తగ్గింది. ఈ క్రమంలో భక్తులు వదిలి పెట్టిన దుస్తులు, వ్యర్థ పదార్థాలు పుష్కర ఘాట్లపై దర్శనమిస్తున్నాయి.

వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని దూర ప్రాంతాల నుంచి పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు గోదావరిలో, పుష్కర ఘాట్లపై పడి ఉన్న చెత్తను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై మండి పడుతున్నారు. పుష్కర ఘాట్లపై పాత దుస్తులు ఎక్కడ పడితే అక్కడ పడి ఉండి పారి శుధ్యం లోపించినా పట్టించుకున్న నాథుడు లేడు. ఆలయ అధికారులు, పంచాయితీ అధికా రుల సమన్వయ లోపంతో పారిశుధ్యం ఎక్కడ వేసిన చెత్త అక్కడే అన్న చందంగా మారిం ది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి గోదావరిలో తేలిన చెత్తతో పాటు పుష్కర ఘాట్లపై ఉన్న వ్యర్థ పదార్థాలను వెంటనే తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. గోదావరిలో తేలిన చెత్తా చెదా రంపై ఆలయ ఈవో కాంతారెడ్డి, పంచాయితీ కార్యదర్శి కరుణాకర్ లను 'ఆంధ్రజ్యోతి' వివ రణ కోరగా రెండు, మూడు రోజుల్లోనే గోదావరి విపరీతంగా తగ్గడంతో భక్తులు వదిలి పెట్టిన వ్యర్థ పదార్థాలు తేలాయని వాటిని తొలగించడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రాష్ట్రంలోనే జిల్లాను ఆదర్శంగా నిలపాలి

ప్రజారోగ్య శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్


మాట్లాడుతున్న రవీంద్రనాయక్

సిరిసిల్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై వైద్యాధికారులు పూర్తి అవగాహనతో ఉండాలని, ఫైర్ సేఫ్టీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలు పరచడంతో పాటు వాటి లక్ష్యాలను సాధించి రాష్ట్రంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లాను ఆదర్శంగా నిలపాలని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ దిశానిర్దేశం చేశారు. గురువారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను ఆన్‌లైన్ ద్వారా రిపోర్టు చేయాలని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉండాలన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఉంటుందని, దీనిపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రజిత, డీపీవో ఉమాదేవి, డాక్టర్ నయాంజాన్, ఏవో సీహెచ్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, కార్తీక్, బాలయ్య, సురేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి ఆలయం


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మే 23: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో గురువారం కిటకిటలాడాయి. వైశాఖ శుద్ధ పౌర్ణమి తోడుగా సెలవు దినాలు కావటంతో దూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు భక్తులు చేరుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టికెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, అర్చకులు పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఎండ తీవ్రతపై భక్తుల దాహార్తీ తీర్చడం కోసం ఆలయం పక్కాన చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయ సూపరింటెండెం ట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణ దారుపాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ,బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంలో ఒకరి రిమాండ్

వేములవాడ టౌన్, మే 23 : భూ వివాదంలో అల్వాల్‌కు చెందిన ఇనుగంటి శ్రావణ్ రావును రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వివరాలు వెల్లడించారు. వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంపల్లి విజయకు తనది కానిని భూమిని ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన మంత్రి రఘు రూ.20 లక్షలకు విక్రయించాడు. కొంత భూమిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేశాడు. మిగతా భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా నక్సలైట్‌నని, డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయంలో గతంలోనే రఘుని రిమాండ్‌కు తరలించారు. ఇటీవల రఘుకు సహకారంగా అల్వాల్‌కు చెందిన ఇనుగంటి శ్రావణ్‌రావు మరో వ్యక్తి డబ్బుల విషయం మర్చిపోవాలని విజయను బెదిరింపులకు గురి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో శ్రావణ్‌రావుపై కేసు నమోదు చేసి కోనరావుపేట మండల పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులకు సహకరించిన పలువురిపై దర్యాప్తు కొనసాగుతోందని ఇనుగంటి శ్రావణ్‌రావు ద్వారా ఎవరైనా మోసపోతే పోలీసులను సంప్రదించాలని డీఎస్పీ సూచించారు.

నకిలీ డాక్యుమెంట్స్ వ్యవహారంలో మరొకరు

సిరిసిల్ల క్రైం: భూమి వ్యవహారంలో నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసానికి పాల్పడిన సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములును గురువారం రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లోని సర్వే నంబరు 960 బై బీలో 363 చదరపు గజాల భూమిని ఎల్లారెడ్డిపేటకు చెందిన ఉప్పుల నారాయణకు 10 సంవత్సరాల క్రితం రూ.3 లక్షలకు విక్రయించాడు.భూమికి హద్దులు చూపించకపోవడంతో అనుమానం వచ్చిన నారాయణ తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాడు. ఆ భూమి ప్రభుత్వానికి చెందినదిగా రికార్డు అయ్యిందని తేలింది. మోసపోయినట్లు తెలుసుకున్న నారాయణ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రాములుపై చీటింగ్ కేసు నమోదు చేశామని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. రాములుపై ఇప్పటికే 20 కేసులు నమోదయ్యాయని, ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

కారు బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

శంకరపట్నం, మే 23: శంకరపట్నం మండలం ఆముదాపల్లి గ్రామంలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఆముదాలపల్లికి చెందిన గురువారం పుట్టపాక సమ్మయ్య బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో సమ్మయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజాఖలీల్ ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య


తరుణ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 23 : ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో పనులు చేయకుండా తిరిగితే బతకడం ఎట్లా? అని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు న్యాలపల్లి తరుణ్ (22) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని జ్యోతి- శ్రీనివాస్ నిరుపేద దంపతుల చిన్న కొడుకు తరుణ్. పదో తరగతి వరకు చదివి మధ్యలోనే మానేశాడు. గ్రామంలోని టీవీ కేబుల్ సెంటర్‌లో దినసరి కూలీగా పని చేసేవాడు. కొద్దిరోజులుగా ఆ పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కూలీ పనులు చేసినా పూట గడవడం గగనమవుతోందని, ఏదైనా పని చూసుకోవాలని తల్లి జ్యోతి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన తరుణ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం స్థానికులు విరాళాలు పోగు చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

సుల్తానాబాద్, మే 23 : బావిలో పడిపోయిన మోటార్‌ను తీయడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తి నీటిలో మునిగి చనిపోయాడు. సుల్తానాబాద్ పట్టణంలోని గడిమహల్‌కు ఖాజావలి ఇంటిలోని బావిలో మోటార్, పైపులు పడిపోయాయి. వాటిని తీయడం కోసం మండలంలోని కనుకులగాంధీనగర్ గ్రామానికి చెందిన కొండపలకల అలియాస్ గట్టు శంకర్(54) అనే వ్యక్తిని తీసుకువచ్చాడు. శంకర్ బావిలో దిగి ముందు ఒకసారి లోపలి నుంచి పైపులు తీసుకొచ్చి అందించాడు. రెండోసారి మోటార్ కోసం దిగిన శంకర్ తిరిగి పైకిరాలేదు. దాంతో ఆందోళన చెంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అలాగే పెద్దపెల్లి అగ్నిమాపక దళ సిబ్బందికి కూడా సమాచారం అందించడంతో వారు వచ్చి నిచ్చెన సాయంతో బావిలోంచి శంకర్ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు.

పనికి తీసుకువచ్చిన వ్యక్తి ఇంటి ఎదుట ఆందోళన

బావిలో నుంచి మోటర్ కోసం గట్టు శంకర్‌ను తీసుకొనివచ్చిన ఖాజావాలి ఇంటి ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కనుకుల గాంధీనగర్ నాయకులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రవణ్ కుమార్‌లు చేరుకుని తెలుసుకుని వారిని సముదాయించారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నిద్రలోనే మృత్యు ఒడికి..

ఇటుకబట్టీ షెడ్ వద్ద విద్యుదాఘాతంతో తల్లీకూతుళ్ల మృతి


బేని బిందాని మృతదేహం


బాబి బిందాని మృతదేహం

కరీంనగర్ క్రైం, మే 23 : పొద్దంతా ఇటుకబట్టీలో పనిచేసిన తల్లీబిడ్డలు అక్కడే యజమాని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో రాత్రి నిద్రిస్తుండగా విద్యుధాఘాతంతో దుర్మరణం చెందారు. కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పరిధిలో లక్ష్మి ఇటుకలబట్టీ వద్ద షెడ్‌లో నివాసం ఉంటున్న ఒడిస్సా రాష్ట్రం నవరంగపూర్ జిల్లా పక్కన్‌గూడ గ్రామానికి చెందిన బేని బిందాని(36), బాబి బిందాని(18)లు విద్యుధాఘాతంతో గురువారం వేకువజామున నిద్రలోనే మృతి చెందారు.

ఒడిస్సాకు చెందిన విద్యాధర్ బిందానికి ఇద్దరు భార్యలుండగా పెద్ద భార్య బేని బిందాని, ఆమె కూతురు బాబి బిందాని, కొడుకు ధశరథ్ బిందానిలు కొంత కాలంగా లక్ష్మి ఇటుకల బట్టీలో పని చేస్తూ ముగ్గురు అక్కడే తాత్కాలిక షెడ్‌లో నివాసం ఉంటున్నారు. విద్యాధర్ బిందాని తన చిన్న భార్యతో కలిసి మరొక ఇటుకబట్టీలో పనిచేస్తూ మరోచోట ఉంటున్నాడు. బేని బిందాని, ఆమె కూతురు బాబి బిందాని, కొడుకు ధశరథ్‌బిందానిలు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇటుకబట్టీలో పనిచేసి అనంతరం వారి గదిలో భోజనం చేసి రాత్రి 9 గంటలకు నిద్రించారు. అర్ధరాత్రి తరువాత గాలివానకు గదిలోని విద్యుత్‌వైర్ తెగి గది ఇనుప తలుపుపై పడింది. తలుపునకు సమీపంలో నిద్రిస్తున్న బాబి బిందాని నిద్రలో ఇనుప తలుపునకు చేయి తాకగానే ఆమె విద్యుదాఘాతానికి గురికాగా, ఆమె పక్కనే నిద్రిస్తున్న తల్లి బేని బిందానికి కూడా విద్యుత్‌షాక్ తగిలింది. ఇద్దరూ నిద్రలోనే మృతి చెందారు. పక్కనే ఉన్న కొడుకు ధశరథ్ బిందానికి ఏమీ కాలేదు.

గురువారం వేకువ జామున ఇటుకబట్టీలో పనిచేసే తోటి కార్మికుడు జగన్నాథ్ బిందాని వారి గది వద్దకు వచ్చి పనికి వెళదామని తలు పుతట్టగా అతనికి విద్యుత్‌షాక్ తగిలింది. వెంటనే ఈ విషయాన్ని బేని బందాని భర్త విద్యాధర్ బిందానికి ఫోన్ చేసి తెలిపాడు. విద్యాధర్ బిందాని వచ్చిన తరువాత విద్యుత్ సరఫరా నిలిపివేసి గదిలోపలికి వెళ్లి చూడగా అప్పటికే తల్లీకూతుళ్లు మరణించి ఉన్నారు. బాబి బిందాని మోచేతి వద్ద విద్యుత్ షాక్‌తో కమిలి పోయిన గాయం ఉంది. అయితే బుధవారం అర్ధరాత్రి వీచిన గాలి వానకు విద్యుత్‌వైర్ తెగి ఇనుప తలుపుపై పడటంతో విద్యుత్ సరఫరా అయి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

లారీ, కారు ఢీ

కొడుకు మృతి తండ్రికి తీవ్రగాయాలు


మహాజన్ సాయిఅక్షయ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం/ మెట్‌పల్లి రూరల్, మే 23: ఇబ్రహీం పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్‌రావుపేట శివారులో గురువారం మేకువ జామున ఎదురు ఎదురుగా లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో కొడుకు మహాజన్ సాయిఅక్షయ్(19) మృతి చెందగా, తండ్రి మహాజన్ శివరామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన మహాజన్ సాయిఅక్షయ్ ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. కొడుకు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లోని కాలేజీల వివరాలను తెలుసుకోవడానికి తండ్రి మహాజన్ శివరామకృష్ణ తన కుమారుడితో కలిసి బుధవారం ఏపీ15టీకే5454 అనే నంబర్ గల కారులో వెళ్లి తిరిగి రాత్రి మెట్‌పల్లికి బయలు దేరారు.

ఈ క్రమంలో గురువారం మేకువ జామున బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలో సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో మహాజన్ సాయిఅక్షయ్ అక్కడికక్కడే మృతి చెందగా శివరామకృష్ణ రెండు కాళ్లు, చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా గాయాలపాలైన శివరామకృష్ణకు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆసపత్రికి తరలించారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించినం దుకు ఆర్యవైశ్య ఆధ్వర్యంలో అవార్డు అందుకొని మంచి భవిష్యత్ ఉన్న సాయిఅక్షయ్ మృతి చెందడం, తండ్రి శివరామకృష్ణ తీవ్ర గాయాలపాలవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

జమ్మికుంట రూరల్, మే 23: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్ (43) అనే రైతు విద్యుదాఘాతానికి మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి ఈదురుగాలులు వీచి వర్షం కురిసింది. శ్రీనివాస్ ఇంట్లో సర్వీస్ వైరు లూజు అయి కిందకు వేలాడింది. తెల్లవారు జామున సర్వీస్ వైరును కర్రతో సరిచేసే సమయంలో శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురై అక్కడికి అక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ భార్య మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.


శ్రీనివాస్ మృతదేహం

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న గ్రామస్థులు



అడ్డుకుంటున్న గ్రామస్థులు

కోనరావుపేట, మే 23: కోనరావుపేట మండలం మామిడిపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇసుక రీచ్‌తో వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న డీటీ జయంత్, ఆర్‌ఐ రాజశేఖర్ గ్రామస్థులను సముదాయించారు. వినకపోవడంతో అధికారులు వెనుతిరిగారు.

ఉపాధి కూలీల వద్ద డబ్బులు వసూలు

- చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, మే 23: చెరువు కట్ట మైసమ్మ పండుగ పేరిట ఉపాధి హామీ కూలీల వద్ద నుంచి రూ.200 చొప్పున వసూలు చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సత్తయ్యకు గురువారం ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు గుర్రపు రాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గిద్దె చెరువులో పనులు చేస్తున్న కూలీల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. చెరువు శిఖం భూమిలో తీస్తున్న మట్టిని రైతుల వ్యవసాయ పొలాలకు అందించాల్సిందీ పోయి ఇతరుకు అమ్ముకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టణ స్థాయి క్రికెట్ పోటీలు

సిరిసిల్ల టౌన్, మే 23 : కలపెల్లి శ్వేత స్మారకార్థం పట్టణ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం సిరిసిల్ల పట్టణంలో 15 వార్డు కౌన్సిలర్ ఆకునూరి విజయనిర్మలబాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో అడ్మిన్, రాజీవ్‌నగర్ జట్లు తలపడ్డాయి. అడ్మిన్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా మెరుగు శ్రీకాంత్ అందుకున్నాడు. విజేత, రన్నరప్ జట్లకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు బహుమతులను అందించారు.

కూలీలకు పరిహారం చెల్లించాలి

సిరిసిల్ల టౌన్, మే 23 : ఉపాధి హామీ కార్మికులకు పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను గురువారం సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కోనరావుపేట మండలం వెంకట్రావుపేట కేసర చెరువులో ఉపాధిహామీ పనుల్లో భాగంగా మట్టిని తవ్వుతుండగా కూలీలపై పెళ్లలు పడ్డాయని, మారుపాక రాజవ్వ మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయని అన్నారు. రాజవ్వ కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షలు చెల్లించాలని, గాయాల పాలైన కూలీలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూర్ రంజిత్ నాయకులు పాల్గొన్నారు.

మర్తన్ పేట సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలి

కోనరావుపేట, మే 23 : మండలంలోని నాగారం గ్రామానికి గతంలో ఇచ్చిన విధంగా మర్తనపేట సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలని నాగారం రైతు మిత్ర సంఘం నాయకులు నాగరాజు, రాకేష్ కోరారు. గురువారం సెస్ ఎండీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుద్దాల విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోందన్నారు. గతంలో మర్తనపేట సబ్ స్టేషన్ నుంచి సరఫరా చేశారని, ఇప్పుడు కూడా ఇవ్వాలని కోరారు. రైతు మిత్ర సంఘం నాయకులు దేవరాజు, మల్లేశం తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం

ముస్తాబాద్, మే 23 : ఎమ్మెల్సీ ఎన్నకల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ గెలుపు ఖాయమని మాజీ ఎంపీపీ, రాష్ట్ర రాజక సంఘం అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని 11, 12వ వార్డుల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక ఉంటేనే న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబరువన్‌గా నిలిచిందన్నారు. కాంగ్రెస్ గెలిచిన ఆరు నెల్లలోపే ప్రజలు, రైతులు బాధపడేలా చేస్తున్నారన్నారు. మాజీ ఏఎంసీ డైరెక్టర్ చిగురు నరేశ్, జగ్గ నరేశ్, ఎనగందుల నర్సింలు,బద్దిడిగె నందు, బనుక నాగరాజు పాల్గొన్నారు.

పూజారి ఘటనపై పోలీసుల విచారణ

వేములవాడ టౌన్, మే 23 : వేములవాడ పట్టణానికి చెందిన ఓ పూజారి అధిక వడ్డీ ఆశచూపి రూ.2 కోట్లతో ఉడాయించిన ఘటనపై పోలీసులు గురువారం విచారణ చేపట్టినట్లు తెలస్తోంది. వేములవాడ పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, పోలీస్ అధికారులు సైతం సదరు పూజారికి అధిక వడ్డీ ఆశకు లక్షల్లో డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కొంతకాలం క్రమం తప్పకుండా అధికవడ్డీ చెల్లించి వారిని నమ్మించి ఒకేసారి పెద్ద మొత్తంలో వసూలు చేసి పరారైనట్లు కనిపిస్తోంది. ఎస్‌బీ పోలీస్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉపాధి కూలీ కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, మే 23:కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో ఉపాధిహామీ కూలి మారుపాక రాజవ్వ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గురువారం ప్రముఖ న్యాయవాది కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి సహాయం అందిస్తారన్నారు. ఈ సందర్భంగా నాయకులు పళ్లెం నర్సయ్య, ఎంపీటీసీ పల్లె మంజుల రవీందర్ రెడ్డి,మధుకర్, వెంకటేష్, మంతిని పెద్ద మల్లేశం, శంకర్, వేణు, లక్ష్మణ్, కుమ్మరి తిరుపతి, జాన్, ప్రశాంత్, శ్రీకాంత్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి..

సిరిసిల్ల రూరల్, మే 23 : సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ విభాగంగా అధ్యక్షుడు నర్మెట ప్రభుదాస్ బాబాయ్ నర్మెట ఎల్లయ్య ఇటీవల మృతిచెందడంతో గురువారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పరామర్శించారు. కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, వార్డు అధ్యక్షుడు వీరగోని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కోలాపురం నర్సయ్య, అడెపు రాజిరెడిడ, పర్శరాములు, పాతూరి తిరుపతిరెడ్డి, కత్తెరపాక రాజు ఉన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్

మెట్‌పల్లి, మే, 23: వివాహిత హత్య కేసులో నిందితుడు షేక్ అఫ్సర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు విలేక రుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన సంగం మమత(38)అనే వివాహితకు తన భర్త గంగాధర్‌తో నాలుగు సంవత్సరల క్రితం విడాకులు తీసుకుంది. అనం తరం కొడుకు, కూతరుతో కలిసి పట్టణంలో ని రాంనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. పట్టణం లోని సాయిరాం కాలనీకి చెందిన షేక్ అఫ్సర్‌తో మమతకు వివాహేతర సంబంధం ఏర్పడింది. షేక్ అఫ్సర్ తరుచుగా మమత ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో షేక్ అఫ్సర్‌కు అతడి భార్యకు గొడవలు జరుగుతుండేవి. దీనికి కార ణం మమతనే అని భావించాడు. ఈనెల 20న అఫ్సర్ భార్యతో గొడవ పడి మమత ఇంటికి రాత్రి కోపంతో వెళ్లాడు. రాత్రింతా మమత, అఫ్సర్ మధ్య గొడవ జరిగింది. అఫ్సర్ కోపంతో మమతను చున్ని, కేబుల్ వైరుతో గోంతు నులి మి, కత్తితో పొట్టలో పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయి ఉన్న మమతను ఇంట్లో ఉన్న కూతురు గమనించి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృ తురాలు మమత కూమారుడు సంగం గ్రహీత్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల ద ర్యాప్తులో మమతతో షేక్ అఫ్సర్‌కు వివాహేతర సంబంధం ఉందని, ఆమె మృతికి అఫ్సర్ కారకు డని తేలింది. గురువారం షేక్ అఫ్సర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. హత్య కేసును ఛేదించిన సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, సిబ్బందిని డీఎస్పీ అభినం దించారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

- సామాజిక సేవతో ప్రజలకు చేరువ
- యువతను ప్రోత్సహించేందుకు పోటీలు
- ఎస్పీ అఖిల్‌మహాజన్
- దోస్తీ మీట్ -2024 క్రీడలు ప్రారంభం

సిరిసిల్ల క్రైం, మే 23: యువత క్రీడల్లో రాణించాలని, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దోస్తీ మీట్ -2024లో భాగంగా గురువారం కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. దేశభవిష్యత్ యువత చేతుల్లో ఉందన్నారు. చెడు వ్యసనాలకు అలవాటుపడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా జిల్లాలో యువతను క్రీడల వైపు ప్రోత్స హించేందుకు దోస్తీ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన యువతీ, యువకులు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట: ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశంతో పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలో స్థానిక అశ్విని ఆసుపత్రి నిర్వాహకులు సమకూర్చిన సీసీ కెమెరాలను పోలీస్ స్టేషన్‌లో గురువారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన దోస్త్ మీట్-2024లో భాగంగా క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణతోపాటు యువతకు ప్రేరణగా నిలవడమే పోలీసుల లక్ష్యమని అన్నారు. గ్రామీణ యువతను క్రీడల వైపు ప్రోత్సహిం చడంతో పాటు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం కోసం దోస్త్ మీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ రమాకాంత్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: క్రీడలు స్నేహసంబంధాలను పెంపొందిస్తాయని రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో దోస్తీ -మీట్ క్రీడాపోటీలను గురువారం ప్రారంభించారు. యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎస్సై వెంకటరమణ, పీసీలు శేఖర్, కుమార్, శ్రీనివాస్, దామోదర్, పీఈటీ చెవుల స్వామి పాల్గొన్నారు.

వీర్నపల్లిలో...

వీర్నపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్సై రమేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దోస్తీ మీట్ క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పీఈటీలు, క్రీడాకారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో..



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సదన్‌కుమార్

ఇల్లంతకుంట: యువత ఆటలపై దృష్టి కేంద్రీకరించాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌గ్రౌండ్‌లో గురువారం దోస్త్‌మీట్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సమాజంలో చోటుచేసుకున్న పరిణామాలను యువకులు నిశితంగా గమనించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, దేహదారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. సమాజంలో క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుందని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. అంతకుముందు క్రీడాకారులతో వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్య క్రమంలో ఎస్సై రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఎస్పీ చంద్రయ్య

చందుర్తిలో..

చందుర్తి: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. చందుర్తి మండలం మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో దోస్తీ మీట్ 2024 కార్యక్రమంలో భాగంగా క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దోస్త్ మీట్‌లో భాగంగా పోటీలను ప్రారంభించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులను చైతన్య పరిచేందుకు క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. యువత చదువులో రాణించాలని, లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.



ఎల్లారెడ్డిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



కోనరావుపేటలో జ్యోతిని వెలిగిస్తున్న ఎస్సై ఆంజనేయులు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సై రమేష్

రైతులపై బీఆర్ఎస్ కపట ప్రేమ



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 23: పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నదాతలు క ష్టాలు పడినా పట్టించుకోలేదని, అధికారం పోగానే రైతులపై ఆ పార్టీ కపట ప్రేమ చూపిస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర ప టానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ ప్రజల్లో ఉనికి కోల్పోతున్నామని గమనించిన బీఆర్ఎస్ నేతలు ఆందోళనలకు దిగుతు న్నారన్నారు. బీఆర్ఎస్ సర్కారు పాలనలో రైతు, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిం దన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిన బీఆర్ఎస్‌ను గత ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారన్నారు. సన్నాలను సాగు చేసేం దుకు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్నాలకు బోనస్ అందిస్తామని ప్రకటించారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అ న్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పదేళ్లలో అన్నదాతలను కష్టాల పాలు చేసిన బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయ కులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, దేవయ్య, బాబు, బుచ్చాగౌడ్, రాజునా యక్, రాజేందర్, రవి, బాల్‌రెడ్డి, కిషన్, రాజుకుమార్, బాలకిషన్, బాలయ్య, దేవరాజు, ప్రతాపరెడ్డి, ఇమాం, వెంకటేశ్, చంద్రమౌళి, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతుల రాస్తారోకో

రాయికల్, మే 23: మండలంలోని రామాజీపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచి మొలకలు వచ్చి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చేసరికి కొనుగోలు జరుగక, వర్షాలకు తడిసి తాము నష్టపోతున్నామన్నారు. అధికారుల తీరును నిరసి స్తూ ధాన్యం కొనుగోళ్లను త్వరగా చేపట్టాలని నినాదాలు చేశారు. రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్ ఖయ్యూం సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ఎండపల్లి, మే 23: మండలంలోని పాతగూడూర్ గ్రామానికి చెందిన బోయిని మహేష్ ఏప్రిల్ 12న ద్విచక్ర వాహనంపై వెళుతుండగా జేబులో నుంచి మొబైల్ ఫోన్ పడిపోయింది. దీంతో అతడు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోయిన ఫోన్‌ని పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా కనుగొని గురువారం బాధితుడికి అప్పజెప్పామని వెల్గటూర్ ఎస్‌ఐ ఉమా సాగర్ తెలిపాడు.

బీఆర్ఎస్ హయాంలో టెస్కో అధికారులకు కమీషన్లు



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్ల టౌన్, మే 23: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమీషన్లకు కక్కుర్తి పడిన టెస్కో అధికారులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని లాల్ బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో లాల్‌బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. నాటి చేనేత, జౌళిశాఖ మంత్రి కేటీఆర్ చెప్పినట్లు సంబంధిత అధికారులు వ్యవ హరించారని ఆరోపించారు. గత ప్రభు త్వంలో కార్మికులకు యారన్ సబ్సిడీ రూ.1.42 పైసలు చెల్లించారని, ప్రస్తుతం రూపాయి నాలుగు పైసలు ఇవ్వడంలో అధికారుల ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇప్పుడు అనేక కారణాలు చెబుతున్న అధికారులకు గత ప్రభుత్వంలో తప్పుగా అనిపించ లేదా? అని మండిపడ్డారు. యజమానులకు రావా ల్సిన బతుకమ్మ చీరల బకాయిలు గతంలో యజ మానుల ఖాతాల్లో నేరుగా వేసే వారని, ప్రస్తుతం ఆసాముల ఖాతాల్లోకి వేసి ప్రభుత్వాన్ని అప్ర తిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అధికారులు ఇంకా కేటీఆర్ కనుసన్నల్లోనే పని చేస్తున్నట్లు భావించాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో కమీషన్లకు కక్కుర్తి పడిన అధికారులు ప్రస్తుత ప్రభుత్వ పని తీరును జీర్ణించుకోలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెస్కో అధి కారులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరిం చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నాయకులు చంద్రమౌళి, నాగరాజు పాల్గొన్నారు.

రైతులను బెదిరించిన గుర్తు తెలియని వ్యక్తులు

చందుర్తి, మే 23 : తమ భూమిని చదును చేసుకుంటున్న రైతులను నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి కలకలం రేపింది. బాధిత రైతు తిరుపతి కథనం ప్రకారం. మండలంలోని సర్వే నంబరు 216/1/49 ప్రభుత్వ భూమిలో కొన్ని సంవత్సరాల క్రితం లావణి పట్టా ప్రభుత్వం తిరుపతికి ఇచ్చింది. అప్పటి నుంచి పత్తి పంటను సాగు చేస్తున్నాడు. భూమి ఎత్తుపల్లాలు ఉండడంతో చదును చేయాలనుకున్నాడు. ఉదయం పూట ఎండ ఉండడంతో ఐదు రోజుల నుంచి రాత్రి వేళల్లో ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్లతో భూమిని చదును చేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ప్రభుత్వ భూమిలో నుంచి మట్టిని తీస్తున్నారని, అనుమతి ఉందా? అని ప్రశ్నించారు. అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, లేదా రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక పనులను నిలిపివేసినట్లు తెలిపారు. ఈ విషయమై చందుర్తి ఎస్సై శ్రీకాంత్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదూ అందలేదని పేర్కొన్నారు.

యువకుడి అరెస్ట్

చందుర్తి, మే 23 : చందుర్తి మండల కేంద్రంలో గంజాయి సరఫరా చేస్తున్న ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లెకి చెందిన రేశం ప్రకాష్ అనే యువకుడు చందుర్తి మండల కేంద్రం శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో గంజాయితో సంచరిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. చం దుర్తిలో యువకులకు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు గాలింపు చేపట్టామని తెలిపారు. ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రకాష్‌ను పట్టుకొని 0.75 గ్రాముల గంజాయితోపాటు రూ.1881 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో యువకుడు పరారైనట్లు పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి జాతర

కథలాపూర్ మే 23:మండలంలోని దుంపెటలో గురువారం శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఘనంగా జరిగింది. నాలుగు రోజులుగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న క్రమంలో కొండపై కొలువైన స్వామివారి దర్శనం కోసం భక్తజనం ఉదయం నుంచే బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో జాతర సందడిగా సాగింది. మహిళలు ఉపవా సాలతో స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించు కున్నారు. పండితులు వామనశర్మ నేతృత్వంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. నిర్వాహకులు భక్తుల కోసం అన్నదానం చేశారు. కాగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కా యితి నాగరాజు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి, లక్ష్మీనర్సింహ స్వామి జయంత్యుత్సవాన్ని పురస్క రించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభ వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు గంగుల కొము రెల్లి-లక్ష్మి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందాంబ కల్యాణం

కథలాపూర్ మే 23 :మండలంలోని తాండ్ర్యాలలో గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు నిర్వహిస్తుండగా గురువారం కళ్యాణం ఘనంగా జరిగింది. చుట్టు పక్కన గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చీర్లవంచ మధు, బండెడ్ల విష్ణు, రాజేశం, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిర్వాకంతోనే గల్ఫ్‌కు కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ టౌన్, మే 23 : కాంగ్రెస్ 60ఏళ్ల పాలనలో సాగునీరు లేక ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కోల్పోయారని, దీంతో గల్ఫ్‌బాట పట్టారని మాజీ జడ్పీవైస్ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్ ఆరోపించారు. వేములవాడ పట్టణంలోని చల్మెడ లక్ష్మీనర్సింహారావు నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నిర్వాకంతోనే కుటుంబాలను వదిలి ఎడారి దేశాలకు వలసవెళ్లారన్నారు. నేడు గల్ఫ్‌కార్మికుల మీద దొంగ ప్రేమ చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనాలు సమకూర్చాల్సిన మంత్రి అమెరికాకు, క్షేత్రస్థాయిలో రైతుల బాధలు పరిశీలించాల్సిన ఎమ్మెల్యే దుబాయికి వెళ్లారని, ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ అన్ని గ్రామాలకు సాగునీరు అందించారని, గ్రామాల్లో వ్యవసాయాన్ని పండగలా మార్చారని అన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదని గుర్తు చేశారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకుడు లక్ష్మీనర్సింహరావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. అనంతరం సీనియర్ బీఆర్ఎస్ నేత పొలాస నరేందర్ మాట్లాడుతూ గల్ఫ్‌కార్మికులు అనుకోని సంఘటనలో శిక్ష అనుభవిస్తున్న సమయంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉందో తెలుసుకోవాలన్నారు. ఆ రోజు గుర్తుకురాని గల్ఫ్‌కార్మికుల కష్టాలు ఈ రోజు ఎందుకు గుర్తుకొచ్చాయని ప్రశ్నించారు. బాధితుల కోసం సొంత డబ్బులు ఖర్చు చేసి స్వదేశానికి రావడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌కార్మికుల కోసం ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన తరువాత కూడా వెళ్లవచ్చన్నారు. గడ్డం హన్మాండ్లు, గంగ మహేష్, కటుకం మల్లేశం, జోగిని శంకర్, వాసాల శ్రీనివాస్, చీటి సంధ్యారాణి, సయ్యద్‌బాబా తదితరులు ఉన్నారు.